క్లుప్తంగా

కూర్మావతారంలో జగన్నాథుడు



పాలకొండ: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు కూర్మావతారంలో జగన్నాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షం కురుస్తున్నా.. స్వామిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద భక్తులు బారులుతీరారు. ఆలయ అర్చకులు విశ్వనాథం దాస్, ఈఓ రాధాకృష్ణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. శనివారం హిరాపంచమిని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు స్వామి దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. హిరపంచమి అనంతరం స్వామివారి తిరుగు రథయాత్ర ప్రారంభమవుతుంది.

ఏఓగా అర్జునరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన అర్జునరావుకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎస్.అర్జునరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఈయన ఇదే కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తూ ఏఓగా ఉద్యోగోన్నతి పొందారు. జెడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు చేతులమీదుగా ఉత్తర్వులను అందుకున్నారు. ఏఓగా ప్రమోషన్ పొందిన అర్జునరావుకు ఎంపీడీఓ జి.పైడితల్లి, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

డీసీహెచ్ఎస్ తనిఖీ



సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ వాగ్దేవి

కురుపాం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డీసీహెచ్ఎస్ వాగ్దేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యాధికారి శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు, పనితీరు, మందుల నిల్వలు, వార్డులను పరిశీలించారు. 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

చెరువులో తవ్వకంపై ఫిర్యాదు

సాలూరు: మండలంలోని కూర్మరాజుపేట రెవెన్యూ పరిధిలో లక్ష్మీసాగరం చెరువులో నీరు నిల్వ ఉండకుండా ప్రభుత్వం నిర్మించిన చప్టాను స్థానిక భూస్వామి తవ్వించారని రైతులు ఆరోపించారు. ఈ మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు తవ్వకంపై రైతులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. చెరువులో నీరు ఉంటే తన భూమి ముంపునకు గురవుతుందని భావించి భూ యజమాని నీరు నిల్వ ఉండకుండా చెరువుకు సమాంతరంగా కాలువ తవ్వి చెరువు నీరు బయటకు వెళ్లేలా తవ్వేశారని చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో స్థానిక రైతులు జగన్నాథం, సూర్యనారాయణ, అప్పారావు, తవిటినాయుడు తదితరులు ఉన్నారు.

నేడు అవగాహన సదస్సు

పార్వతీపురం టౌన్: మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు శుక్రవారం తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు రెండో అదనపు జిల్లా కోర్టు సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

అప్పయ్యపేటలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శిరీష

సీతానగరం: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామాల్లో రోగులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ శిరీష అన్నారు. అప్పయ్యపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో సుమారు వంద మందికి శిరీష వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీటీసీ బి.కుసుమ ఆధ్వర్యంలు జరిగిన కార్యక్రమంలో సచివాలయ కన్వీనరు బి.సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశ వర్కర్లు తమ సేవలు అందించారు.

• పీఓ ప్రశంసలు



శిరీషను అభినందిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని టి.శిరీష ఇంటర్మీడియట్ హెచ్ఈసీ గ్రూపులో 950 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచింది. ఇటీవల విజయవాడలో జరిగిన 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష చెక్కు, ప్రశంసాపత్రం అందుకుంది. ఈ విద్యార్థినిని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి శుక్రవారం తన చాంబర్‌లో అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుకులం సెల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పైడి సూర్యకుమారి ఉన్నారు.

• పిల్లలతో పనిచేయించడం నేరం

పాలకొండ: బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి విజయరాజ్‌కుమార్ హెచ్చరించారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు కార్మికశాఖ అధికారి ఆర్‌వీ శ్రీనివాసరావు, సహాయ అధికారి కె.రామకృష్ణ, సోషల్ వర్కర్ మధు రమీనాక్షి, సీనియర్ న్యాయవ్యాదులు ఉన్నారు.



దుకాణంలో తనిఖీ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి, తదితరులు

• డ్రైడేగా ఫ్రైడే



ర్యాలీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

సీతంపేట: ప్రజలు ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని ఎంపీడీఓ కొండపల్లి సత్యం కోరారు. సీతంపేటలో పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగుకాలువలను శుభ్రం చేయించారు. దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్‌ను చేపట్టారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశమై పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం

- ఇదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అజెండా
- మేనిఫెస్టోను కచ్చితంగా అములు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్
- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: అర్హతే కొలమానంగా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అజెండా అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని చిట్టపులివలస గ్రామంలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఉన్న సుమారు 300 గడపలకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, ఈ నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారమై సంబంధిత అధికారులతో మాట్లాడారు. 2019 ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 99 శాతం పైగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదలు ఉండరాదనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న పేదలకు సెంటు స్థలంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందిస్తున్నారని గుర్తుచేశారు. గతంలో పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వలేని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పేదలకు ఇస్తున్న ఈ స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చడం సరికాదన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో మధ్యవర్తులు లేకుండా నేరుగా ప్రజలకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంత రైతుల చిరకాల వాంఛ తోటపల్లి కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. అలాగే రూ.24.5 కోట్లతో చేపట్టిన కిమ్మి–రుషింగి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఈ వంతెనను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రజల మనసులు గెలిచిన సీఎం జగన్‌కు ప్రజల కష్టాలు కూడా తెలుసునని, అందుకే అడగక ముందే ప్రతీ ఇంటి ముంగిటకు ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడంలో ఆయన తండ్రిని మించిన తనయుడిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఈ సందర్భంగా చిట్టపులివలస గ్రామ రహదారిని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరగా.. త్వరలోనే చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ శ్రీనివాసరావు, సొంట్యాన సింహాచలం, డోకల శ్రీను, మాచర్ల వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విక్రమపురంలో..

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం గ్రామంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు విక్రమపురం గ్రామానికి సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు. అలాగే సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తమ వద్ద ఉన్న సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట ఆర్బీకేలో జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు అన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎల్విన్‌పేట రైతుభరోసా కేంద్రం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. అలాగే కుల, నివాస, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు భూముల మ్యుటేషన్లు, పాస్‌బుక్ కరెక్షన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు, కొత్త రేషన్ కార్డు, రేషన్‌కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించిన కుటుంబ వివరాల్లో సభ్యుల పేర్లు తొలగింపు తదితర సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 24 నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలను గుర్తించి వాటిని సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి, ఈఓపీఆర్డీ జగదీష్‌కుమార్ తదితరులున్నారు.

రెండు బృందాలతో పర్యవేక్షణ

గరుగుబిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై జూలై 1 నుంచి గ్రామ సచివాలయం పరిధిలో రెండు ప్రత్యేక బృందాలతో పర్యవేక్షించనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ ఒక బృందంలో ఉంటారని, రెండో బృందంలో తహసీల్దార్, ఈఓపీఆర్డీ ఉంటారని అన్నారు. జూలై 1న రావుపల్లి, రావివలస సచివాలయాల్లో, 4న నాగూరు, పెద్దూరు సచివాలయ పరిధిలో, 6న తోటపల్లి, ఆర్టీటవలస సచివాలయాల్లో, 11న చినగుడబ, ఉల్లిభద్ర, 13న సంతోషపురం, సివ్వాం సచివాలయాల్లో, 15న గొట్టివలస, ఉద్దవోలు సచివాలయాల్లో, 18న గరుగుబిల్లి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా శాఖాల అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

కాలువల నిర్మాణంలో జాప్యం తగదు



కాలువ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ ధనుంజయరావు

గరుగుబిల్లి: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో కాలువల నిర్మాణ పనుల్లో జాప్యం జరగడంపై రైతులు ఆందోళన చెందుతున్నారని మాజీ ఎంపీపీ ద్వారపురెడ్డి ధనుంజయరావు అన్నారు. నుంకి సమీపంలోని తోటపల్లి ప్రాజెక్టు కుడి కాలువ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కుడి కాలువ నుంచి గరుగుబిల్లి, వంగర, బలిజిపేట మండలాల్లోని 10వేల ఎకరాలకు సాగునీరు సరఫరా జరుగుతుందన్నారు. కాలువ పరిధిలో నిర్మిస్తున్న రక్షణ గోడలు బలహీనంగా ఉండడంతో సాగునీరు సరఫరాపై రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు పనులను పూర్తిస్థాయిలో చేపట్టకుండా తాత్కాలిక ప్రాతిపదికన పనులను చేపట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంక్రీటు పనులను త్వరితగతిన పూర్తిచేసి శివారు భూములకు సాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

స్కిల్ కళాశాల కోఆర్డినేటర్‌గా వెంకటరమణ



నియామక పత్రం అందజేస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సీతంపేటలో త్వరలో ఏర్పాటు చేయనున్న స్కిల్ కళాశాల జిల్లా కోఆర్డినేటర్‌గా వెంకటరమణ నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి శుక్రవారం తన కార్యాలయంలో అందజేశారు. నైపుణ్య కళాశాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్వహించనున్న కోర్సులపై గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, నాక్ ఏడీ చిట్టిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలకరి పలకరింపు



పట్టణ వీధుల్లో నిలిచిన వర్షపు నీరు

పాలకొండ రూరల్: రుతుపవనాలు అనుకూలించడంతో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం వరకు మోస్తరు వర్షం కురవడంతో పాలకొండ పట్టణంతో పాటు మండల పరిధిలో రైతులు ఆనందంతో పొలంబాట పట్టారు. పొలాలను దుక్కి చేసుకుని నారుమడులు సిద్ధం చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. మరోవైపు వర్షానికి పట్టణంలోని ప్రధాన రోడ్లపై నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. వేసవి తీవ్రతకు హడలి పోయిన ప్రజలకు తాజా వర్షం ఊరటనిచ్చింది.

అంగన్‌వాడీల్లో టేక్ హోం కిట్ల పంపిణీ

సీతానగరం: ప్రభుత్వం పిల్లల్లో రక్తహీన నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెదబోగిలి మేజరు పంచాయతీ సర్పంచ్ జె.తేరేజమ్మ, ఎంపీటీసీ ఎస్.గౌరి అన్నారు. పెదబోగిలి మేజరు పంచాయతీ పరిధిలో ఉన్న బుడ్డిపేట, పెదబోగిల, సీతానగరం, అప్పయ్యపేట గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న 14 నుండి 18 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పిల్లలకు పౌష్టికాహారం కిట్‌లను అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువ మంది పిల్లలు రక్తహీనత కారణంగా తరచూ మృత్యువాత పడుతున్నారని వైద్యారోగ్య శాఖ నిర్వహించిన సర్వేలో వెల్లడి కావడంతో ప్రభుత్వం బృహత్తరమైన కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని, ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహార కిట్లను వినియోగించాలని సూచించారు. పంచాయతీ ఈఓ వెంకటరావు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. కొత్తవలస గ్రామంలో పిల్లలకు పౌష్టికాహార కిట్లను అంగన్‌వాడీలు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



గొల్లవీధి పరిసరాల్లో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలకొండ రూరల్: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. పట్టణ శివారు వీధుల్లో శుక్రవారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సూక్ష్మసేద్యంతో ఆశించిన దిగుబడులు



గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్న వాస్సన్ సంస్థ ప్రతినిధులు

భామిని: తక్కువ నీటి సదుపాయం ఉన్న చోట సూక్ష్మ సేద్యం, సుస్థిర వ్యవసాయ విధానాలు మంచి ఫలితాలను ఇస్తాయని వాస్సన్ సంస్థ ప్రతినిధి జక్కరెడ్డి సూచించారు. మండలంలోని రాతులగూడ, చీమలగూడ, మణిగ గ్రామాల పరిధిలో సుస్థిర వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంట క్షేత్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని రైతులకు వివరించారు. ఈ విధానంలో తక్కువ నీటితో నిరంతరం అన్ని రకాల పంటలను సాగు చేయవచ్చన్నారు. అనంతరం మణిగలో సర్పంచ్ కొండగొర్రి మంగ ఆధ్వర్యంలో గిరిజన రైతులతో మాట్లాడారు. పండిస్తున్న పంటల వివరాలపై ఆరా తీశారు. గిరిజన కుటుంబాలకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరల సాగు, చేపల చెరువుల నిర్వహణలో మెళకువలు వివరించారు. కార్యక్రమంలో వాస్సన్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ ముద్దాడ భార్గవి, కళ్యాణ పాత్రో, కీర్తిరాయి సుగ్రీవులు పాల్గొన్నారు.

పశుబీమాతో రైతుకు ప్రయోజనం



పశుబీమా పథకంపై పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు

భామిని: మండలంలోని లివిరి గ్రామంలో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ డివిజనల్ సహాయ సంచాలకులు బసవ శ్రీనివాసరావు వైఎస్సార్ పశుబీమా పథకంపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి విపత్తులు, ప్రమాదవశాత్తు పశువులు మృతి చెందినట్లయితే పాడిరైతులను ఆర్థిక నష్టం నుంచి బయటపడేందుకు పశుబీమా పథకం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. పలువురు పాడిరైతులతో బీమా ప్రీమియం కట్టించారు. ఇందులో చేరిన వారికి మూడేళ్ల బీమా రక్షణ ఉంటుందన్నారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పొల్లలో పశువైద్యాధికారి సంతోస్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరి త్రినాథ్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో ఎంఈఓ భాస్కరరావు, సర్పంచ్ భార్గవనాయుడు

భామిని: మండలంలో పసుకుడి ఎంపీపీ స్కూల్ నుంచి బదిలీ అయిన టీచర్లు మురళీ, శంకర్‌లను ఎంఈఓ వి.భాస్కరరావు, స్థానిక సర్పంచ్ బెవర భార్గవనాయుడు, గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంతో పాటు వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పత్తినాట్లు



పొలంలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతు కుటుంబం

భామిని: తొలకరి చినుకులు కురవడంతో రైతులు ఖరీఫ్ సాగుపనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో అధిక శాతం మంది రైతులు ప్రధాన పంటగా పత్తిని సాగుచేస్తుంటారు. గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో పొలాలను దుక్కిచేసి పత్తి విత్తనాలు విత్తుకుంటున్నారు. నేరడి–బి వద్ద శుక్రవారం ఓ రైతు కుటుంబం తాడు, సాలు పద్ధతిలో పత్తి విత్తనాలు వేసుకుంటూ కనిపించారు.

సీహెచ్‌సీకి రోగుల తాకిడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

సీతంపేట: స్థానిక సీహెచ్‌సీకి రోగుల తాకిడి పెరిగింది. గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం, అడపాదడపా వర్షాలు కురిసి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. టైఫాయిడ్, వైరల్ ఫీవర్‌తో వచ్చిన వారికి ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్యులు సేవలందిస్తున్నారు. రోగులకు రక్తపరీక్షలు చేసి అవసరమైన చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.